
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 129 వ భాగం

## మత్స్యావతారం - 1

హిందూమతంలో దశావతారాలు అనగానే మనకి తెల్సినవి ఇవి – మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, రామ, కృష్ణ, బుద్ధ దాని తర్వాత కల్కి. ఇందులోకి బుద్ధుణ్ణి అనవసరంగా లాగారనీ నిజానికి బలరాముడు ఎనిమిదో లేదా తొమ్మిదో అవతారం అనీ, అబ్బేకాదు తొమ్మిదోది జగన్నాథుడనీ, అదీ కాదు విఠోబా అనీ వాదించేవారున్నారు. ఏదైతేనేం, మోహినీ అవతారం, పృథువు, ఆది మూలావతారం, కపిలావతారం లాగా అనేక రకాలుగా భగవంతుడు కనిపించడం ఈ దశావతారాలలో ఉండదు. దీనికి కారణం ఈ అవతారాలు చిన్నవి – అనేక సంవత్సరాలు భూమి మీద ఒక రూపంలో జన్మించి జీవితం చాలించినట్టూ కనిపించదు కనక ముఖ్యమైనవి ఈ పది అవతారాలలో చెప్పారు. ఈ దశావతారాల్లో మొదటిది మత్స్యావతారం. ఈ అవతారాల గురించి తెల్సుకునే ముందు కాల గణన అనే విషయం చెప్పుకోవాల్సిందే. మరీ చిన్న అణువునుంచి లెక్కలు ఉన్నాయి (పోతన మహాభాగవతం 3-345) కానీ అవి వదిలేసి మనకి అర్థమయ్యేవి చూద్దాం.

పక్షము అంటే పదిహేను తిథులు (ఒక తిథి ఒక రోజు కంటే ఎక్కువగా ఉండొచ్చు). రెండు పక్షాలు ఒక నెల. రెండు నెలలు ఒక ఋతువు. నాలుగు నెలలు ఒక కాలము. ఆరు నెలలు ఒక ఆయనము. రెండు ఆయనములు (ఉత్తర, దక్షిణ) లేదా పన్నెండు నెలలు ఒక మానవ సంవత్సరం. నూరు సంవత్సరాలు మన ఆయుర్దాయం. దేవతల కాలం మనదానికి 360 రెట్లు. మనకి ఒక సంవత్సరం లేదా 360 రోజులు గడిస్తే వారికి ఒక దినం. వారి రాత్రి కూడా అంతే సమయం. అలా దేవతలకి 360 రోజులు గడిస్తే వారికి ఒక దివ్య సంవత్సరం. అటువంటి దివ్య సంవత్సరాలు పన్నెండు వేలు గడిస్తే ఒక మహాయుగం. మరో విధంగా నాలుగు యుగాలు (కృత, త్రేతా, ద్వాపర, కలి) ఒక మహాయుగం. ఇందులో నాలుగు వేల దివ్య సంవత్సరాలు కృతయుగం, మూడువేల దివ్య సంవత్సరాలు త్రేతాయుగం, రెండువేల దివ్య సంవత్సరాలు ద్వాపరం; వేయి దివ్య సంవత్సరాలు కలియుగం. ఒక యుగానికీ మరో యుగానికీ మధ్య సంధికాలం అనేది

కూడా ఉంది. అవి 800, 600, 400, 200 దివ్య సంవత్సరాలుగా చెప్పబడింది. ఆ లెక్కన మొత్తం పన్నెండువేల దివ్యసంవత్సరాలు ఒక మహాయుగం. దీని నిడివి 12000x360=4320000 మానవ సంవత్సరాలు. ఇంకా ఉంది కథ. ఇటువంటి వేయి మహాయుగాలు (లేదా నాలుగు యుగాలు ఉన్నాయి కనక చతుర్యుగాలు) గడిస్తే అది బ్రహ్మకి ఒక పగలు. ఇదే కల్పం అంటే. దీని నిడివి 432 కోట్ల సంవత్సరాలు మన సమయం ప్రకారం (లేదా 4320000 x 1000); ఆయన రాత్రి కూడా ఇంతే కాలం. అటువంటి పగలూ రాత్రీ గడిస్తే బ్రహ్మకి ఒకరోజు. అలా 360 రోజులు గడిస్తే ఒక ఏడాది. ఆయన జీవితకాలం అటువంటి నూరు సంవత్సరాలు. పగలు గడిచి రాత్రి సమీపిస్తూండగా బ్రహ్మ నిద్రలోకి జారుకుంటాడు. అప్పుడు మొత్తం జగత్తు లయమైపోయి అంధకారం తప్ప ఏమీ లేదు. మర్నాడు లేచాక మొదటినుండీ మరో సృష్టి. ఇదీ వరస. బ్రహ్మ నిద్రలోకి జారుకున్నప్పుడు సృష్టికి కావాల్సిన ప్రమాణాలు వేదాలు కనక వాటిని రక్షించాల్సిన భాధ్యతా, నిద్రలోంచి లేచేసరికి వాటిని మళ్ళీ బ్రహ్మకి అప్పగించాల్సిన భాధ్యతా భగవంతుడిదే కదా? ఇదే మత్స్యావతారం మొదలుపెట్టే ముందు తెలుసుకోవల్సిన కాల వివరణ.

బ్రహ్మకి ఒక పగలు గడిచి నిద్రలోకి జారుకోబోతున్నాడు. ఇదే అదనుగా హయగ్రీవుడనే రాక్షసుడు వేదాలు పట్టుకుపోయి నీటిలో దాచాడు. దీని అర్థం ఏమిటంటే ముందు రాబోయే తరాలకి మంచి లక్షణాలు ఉండకుండా చేద్దామనుకునే రాక్షసులు ఉన్నారు ప్రతీ యుగంలోనూ; కానీ భాగవతంలో పోతన మొదటి పద్యంలో చెప్పినట్టూ భగవంతుడు 'లోక రక్షైకా రంభకున్, భక్తపాలన కళాసంరంభకు, దానవోద్రేక స్థంభకున్." అందువల్ల మనలో పెరిగే హయగ్రీవుడి వంటి రాక్షస గుణాలు, లేదా కోరికలు (కోరికలు గుర్రాలు కనక హయగ్రీవుడు అనే రాక్షసుడు) అరికట్టే పని భగవంతుడి మీద పడింది. అలా హయగ్రీవుణ్ణి చంపి (లేదా రాక్షస గుణాలని అంతరింపచేసి, ధర్మాలకి మూలమైన వేదాలని రక్షించడానికి) భగవంతుడు మత్స్యావతారం ఎత్తడానికి సంసిద్ధుడయ్యాడు. ఈ అవతారం నీటిలో యుద్ధం చేయడానికి బాగా పనికొచ్చేది కనక. ఈ పనిలో భాగంగా కొత్తగా రాబోయే సృష్టికి కావాల్సిన మనుషులూ, జంతువులూ, విత్తనాలూ వగైరా జాగ్రత్త పరచాలి. ఇదంతా ఎలా జరిగింది అని కథ చెప్పే సూతుణ్ణి అడుగుతున్నారు నైమిశారణ్యంలో ఉన్న మునులు.

సీ. విమలాత్మ! విన మాకు వేడ్క యయ్యెడి; మున్ను
హరి మత్స్యమైన వృత్తాంతమెల్లఁ;
గర్మబద్ధుని భంగి ఘనుఁ డీశ్వరుఁడు లోక
నిందితంబై తమోనిలయమైన

మీనరూపము నేల మే లని ధరియించె?
నెక్కడ వర్తించె? నేమి చేసె?
నాద్యమై వెలయు న య్యవతారమునకు నె
య్యది కారణంబు? గార్యాంశ మెట్లు? [8-692]

ఆ. నీవు దగుదు మాకు నిఖిలంబు నెఱిఁగింపఁ
దెలియఁ జెప్పవలయు, దేవదేవు
చరిత మఖిలలోక సౌభాగ్య కరణంబు
గాదె? విస్తరింపు క్రమముతోడ. [8-692.1]

ఘనుడు, ఏ కర్మా అంటనివాడూ, అన్నింటికీ కారణమైన ఈశ్వరుడు, తమోగుణంతో నిండి ఉండే చేప రూపం (మీనరూపము) కర్మకి బద్ధుడిలాగా ఎందుకు ధరించాడు? ధరించాక ఎక్కడెక్కడ సంచరించాడు, ఏం చేసాడు? అసలీ అవతారానికి కారణం ఏమిటి? దేవదేవుడి చరిత్ర అన్ని లోకాలకీ సౌభాగ్య కారణమే (దేవదేవు చరిత మఖిలలోక సౌభాగ్య కరణంబు) కనక ఆ కథంతా మాకు పూర్తిగా ఒక వరసలో (క్రమముతోడ) చెప్పు. ఇలా అడిగినవారికి సూతుడు సమాధానం చెపుతున్నాడు.

సీ. విభుఁ డీశ్వరుఁడు వేదవిప్రగోసురసాధు
ధర్మార్థములఁ గావఁ దనువుఁ దాల్చి,
గాలిచందంబున ఘనరూపములయందు
దనురూపములయందుఁ దగిలియుండు;
నెక్కువఁ దక్కువ లెన్నఁడు నొందక-
నిర్గుణత్వంబున నెఱియు ఘనుఁడు;
గురుతయుఁ గొఱఁతయు గుణసంగతివహించు
మనుజేశ! చోద్యమే మత్స్య మగుట? [8-694]

తే. వినుము; పోయిన కల్పాంతవేళఁ దొల్లి

ద్రవిళదేశపురాజు సత్యవ్రతుండు
నీరు ద్రావుచు హరిఁగూర్చి నిష్ఠతోడఁ
దపముఁ గావించె నొకయేటి తటము నందు. [8-694.1]

ఇదే విషయం పరీక్షిత్తు శుకయోగిని అడిగాడు. ఆయన చెప్పిన కథే మీకు కూడా చెప్తున్నాను అని మొదలుపెడుతూ సూతుడు అంటున్నాడు. వేదాలని, విప్రులనీ, సాధువులనీ ధర్మమార్గం లో ఉంచడానికి భగవంతుడు అనేక అవతారాలు ఎత్తడం విదితమే. అందుకోసం తాను నిర్గుణ తత్వం కలవాడైనా, ఎక్కువా తక్కువా అని చూడకుండా, అవసరం బట్టి వాయువులా (గాలి చందంబున) గొప్పరూపాలలో (ఘనరూప), తక్కువ రూపంలో (తనురూప, చిన్నరూపం) అవతారం జరుగుతూ ఉంటుంది. దానివల్ల భగవంతుడు మీనం గా పుట్టడంలో ఆశ్చర్యం ఏమీ లేదు (చోద్యమే మత్స్య మగుట?). ఇదిలా ఉంచి ద్రవిళ దేశంలో సత్యవ్రతుడనే రాజు (పేరు జాగ్రత్తగా గమినించారా?) కేవలం నీరు మాత్రం తాగుతూ నిష్టతో తపస్సు చేయడం మొదలుపెట్టాడు ఒక చెరువు (తటము) గట్టుమీద.

భగవంతుడు ఒక చోట జనించాలంటే అనేకానేక విషయాలు కలిసిరావాలి. తాను పుట్టడానికి ముందు అనరణ్యుడు నుంచి రఘువుదాకా సూర్యవంశంలో అనేకమంది పుట్టాక పుత్రకామేష్టి వల్ల రాముడు తీరిగ్గా పుట్టాడు. ఎవరికో ఒకరికి కాదు. రాజు అవాలి, బాణసంపద కలిగి ఉండాలి, కైక లాంటీ స్త్రీ అడవులకి తోలాలి వగైరా అన్నీ కలిసివచ్చాక మాత్రమే. అలాగే నిష్టతో తపస్సుచేసే సత్యవ్రతుడు (సత్యం ఆచరించేవాడు) లాంటివారికి మాత్రమే, వాళ్ళేం చేయగలరో ముందే అంచనా వేసి, తదనుగుణంగా అవతారం జరుగుతుంది. ఇదే మత్స్యావతారంలో కుడా జరుగుతోంది.

వ. మఱియు, నొక్కనాఁడమ్మేదినీ కాంతుండు గృతమాలిక యను నేటి పొంత హరిసమర్పణంబుగా జలతర్పణంబు జేయు చున్న సమయంబున నా రాజు దోసిట నొక్క మీనుపిల్ల దవిలివచ్చిన నులికిపడి, మరలం దరంగిణీ జలంబు నందు శకుల శాబకంబు విడిచె; నట్లు విడి వడి నీటిలో నుండి జలచరపోతంబు భూతలేశ్వరున కి ట్లనియె.

[8-695]

ఆ రాజు (మేదినీకాంతుండు – మేదిని, భూమి; కాంతుండు, పాలించేవాడు, రాజు) కృతమాలిక అనే ఏటి దగ్గిర (పొంత) తర్పణం (ఎవరికోసం? హరి సమర్పణముగా) విడుస్తున్నప్పుడు ఒక చేప పిల్ల దోసిలిలోకి వచ్చింది. అయ్యో అని ఉలిక్కిపడి దాన్ని నీళ్ళలోకి విడిచిపెట్టాడు. అది నీళ్ళలోంచి ఇలా అంది రాజుతో. ఈ వచనంలో చేప పిల్లకి వాడిన

పదాలు గమనించండి – మీనుపిల్ల, శకుల (చేప) శాబకంబు (పిల్ల), జలచరపోతంబు (నీటిలో తిరిగే పిల్ల). అలాగే రాజుకి రెండో పదం గమనించారా? భూతలేశ్వరుడు – భూమిని పాలించేవాడు. వచనం కానివ్వండి, పద్యం కానీయండి, మన పోతన అక్షయతూణీరుడు.

కాస్త ఆగి ఆలోచించుదాం, చేపలు, జంతువులు మనుషులతో మాట్లాడతాయా? బ్రహ్మ జ్ఞానం కలిగాక ప్రతీ జీవి తనలాంటి బ్రహ్మమేననీ తెలిసాక యోగులు అన్ని జీవులతో అంతర్గతంగా సంభాషించగలరు. ఇదే విషయం రమణ మహర్షి జీవితంలో, కృష్ణుడు కాళీయుడితో, గరుడుడితో మాట్లాడినట్టూ వగైరా ప్రతీ యోగుల విషయంలోనూ చూడవచ్చు. నోటితో మాట్లాడే భాషతో పనిలేదు వారికి. అందుకే కీకారణ్యంలో తపస్సు చేసుకునే యోగులకి ఈ జంతువులంటే భయం లాంటివి ఉండవు కదా అవి ఆ యోగులని కాపాడడానికి సిద్ధంగా ఉంటాయి. అదీగాక భయం అనేది తెట్టిపెట్టుకున్న దరిద్రం, పుట్టుకతో వచ్చిన లక్షణం కాదు. అష్టదరిద్రాలు వదిలితే గానీ బ్రహ్మ జ్ఞానం రాదని తెల్సినదే. అందుకే చేప పిల్ల ఇలా మాట్లాడింది అని చెప్పడం లో ఏమీ తప్పులేదు.

మత్త. పాటువచ్చిన జ్ఞాతి ఘాతులు పాపజాతి ఝషంబు లీ
యేటఁ గొండొక మీనుపిల్లల నేఱి పట్టి వధింప న
చ్చోటు నుండక నీదు దోసిలి చొచ్చి వచ్చిన నన్ను న
ట్టేటఁ ద్రోవఁగఁ బాడియే? కృప యింత లేక దయానిధీ! [8-696]

పాపజాతికి చెందిన అనేక పెద్దచేపలు (పాపజాతి ఝషంబులు), మా తోడబుట్టినవే (పాటు వచ్చిన), మాతోటివే (జ్ఞాతులు) అయినా, చిన్న చేపలు కనబడితే తినేస్తాయి. అందుకే నీ దోసిలిలోకి వచ్చి చేరాను. నా మీద కనికరం చూపించకుండా (కృపలేక) దయానిధివైన నువ్వు ఇలా నట్టేట్లో వదిలేయడం మంచిదేనా?

ఆ. వలలు దారు నింక వచ్చి జాలరి వేఁట
కాఱు నేఱు గలఁచి కారపెట్టి
మిడిసి పోవనీక మెడఁ బట్టుకొనియెద;
రప్పు డెందుఁ జొత్తు? ననఘచరిత! [8-697]

పెద్దచేపలు తినకపోయినా జాలర్లు (వేటకారు) వచ్చి ఏరు కలకలం చేసి వలలు వేస్తే అందులో పడ్డాక తప్పించుకోకుండా మెడ పట్టుకుంటారు. అప్పుడు ఎక్కడకీ వెళ్లలేను కదా? చేప పిల్ల తర్వాత ఏమౌతుందో, దీనికి – అసత్యం పలకడని పేరున్న సత్యవ్రతుడేమంటాడో వచ్చే వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS